ఇసుక దందా..

- కాటవరంలో ఇసుక మాఫియా
- టన్నుకు రూ.1500 వసూలు
- పట్టించుకోని అధికారులు



కాటవరంలోని స్టాక్ పాయింట్ వద్ద జరుగుతున్న ఇసుక లోడింగ్

సీతానగరం: ఇసుక మాఫియా ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. నిబంధనలను అతిక్రమించి యథేచ్ఛగా అక్రమ దందా కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి అధిక ధరకు విక్రయాలు జరుగుతున్నాయి. అయినా అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. గోదావరి వరద సమయంలో ప్రజలకు ఇసుక కొరత లేకుండా చూసేందుకు కాటవరంలో ఇసుక స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేశారు. వాటిలోని పెట్రోల్‌బంకు వద్ద ఉన్న పాయింట్‌లో ఇసుకను అధిక ధరకు విక్రయిస్తున్నారు.

జోరుగా అమ్మకాలు

అఖండ గోదావరిలో ఇసుక తవ్వకాలు జరిపి పలు కాటవరంలో పలు స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేశారు. పెట్రోల్ బంక్‌ను ఆనుకుని ఉన్న స్టాక్ పాయింట్ నుంచి అధిక ధరలకు ఇసుక అమ్మకాలు జరుపుతుండటంతో పగలు, రాత్రి అనే భేదం లేకుండా వందల లారీలు స్టాక్ పాయింట్‌కు చేరుకుంటున్నాయి. మూడు రోజులుగా స్టాక్ పాయింట్ నుంచి ఇసుక అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ప్రొక్లెయిన్‌తో లారీలపై ఇసుక ఎగుమతి చేస్తున్నారు. మార్కెట్ లారీలపై కూడా అక్రమ ఇసుక రవాణా జరుపుతున్నారు. పగలు, రాత్రులు ప్రొక్లెయిన్‌తో లారీలపై ఇసుక ఎగుమతులు చేస్తున్నారు.



కాటవరం వద్ద రోడ్డుపై బారులు తీరిన లారీలు

లారీల బారులు

ప్రభుత్వ నిబంధనల ప్రకారం పట్టా భూముల్లో తవ్విన ఇసుకను టన్ను రూ.214కు విక్రయించాలి. కానీ పెట్రోల్ బంకు పక్కనే ఉన్న స్టాక్ పాయింట్ నుంచి టన్ను ఇసుకను రూ.1500కు విక్రయిస్తున్నారు. ఇక్కడ రోజుకు పది నుంచి 40 టన్నుల లారీల వరకూ ఇసుక రవాణా జరుగుతోంది. గోదావరి వరదతో ఇసుక లభించకపోవడంతో స్టాక్ పాయింట్లు వద్ద ఇసుక అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో కాటవరంలో రోడ్డుపై లారీలు బారులు తీరుతున్నాయి. ఇక్కడ అధిక ధరలు వసూలు చేస్తున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఈ విషయాన్ని మైన్స్ ఏడీ ఫణిభూషణ్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా పట్టా భూముల్లో ఇసుక తవ్వకాలు జరిపిన వారు.. టన్ను రూ. 214కు అమ్మకాలు జరపాలన్నారు. అధిక రేట్లకు అమ్మకాలు జరిపితే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

క్లుప్తంగా

పేకాట శిబిరంపై దాడి

పెదపూడి: మండల కేంద్రమైన పెదపూడి గ్రామంలోని వేట్లపాలెం వెళ్లే దారిలో గల రైస్‌మిల్లులో పేకాట శిబిరంపై దాడి చేసి, 11 మందిని అరెస్టు చేశామని ఎస్సై ఎస్.తులసీరామ్ సోమవారం తెలిపారు. ప్రత్యేక పోలీసు బృందంతో ఆదివారం రాత్రి ఈ దాడి జరిగిందన్నారు. నిందితుల నుంచి రూ.27,330 స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి, అరెస్ట్ చేశామని తెలిపారు. కాగా.. అరెస్ట్ అయిన వారిలో కూటమి నాయకులు ఉన్నట్టు సమాచారం.

ప్రత్యేక పూజలు



కొంకుదురులో త్రిముఖ లింగేశ్వరస్వామి

బిక్కవోలు: కొంకుదురు బుడిత మామిడి వద్ద కొలువైన బాలా త్రిపుర సుందరీ సమేత త్రిముఖ లింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి, స్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాధన జరిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పడాల వెంకటరామారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గైట్ లైబ్రేరియన్ మీరాకు అవార్డు



ఉత్తమ గ్రంథపాలకుని అవార్డు అందుకుంటున్న షేక్ మీరా

రాజానగరం: జాతీయ గ్రంథపాలకుని దినోత్సవాన్ని పురస్కరించుకుని గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ లైబ్రేరియన్ షేక్ మీరాకు జాతీయ ఉత్తమ గ్రంథపాలకుడు అవార్డు లభించింది. ఈ విషయాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎండీ ధనరాజ్ సోమవారం తెలిపారు. ఫాదర్ ఆఫ్ లైబ్రరీ సైన్స్‌గా పేరొందిన డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్ 133వ జయంతిని మద్రాసు లైబ్రరీ సంఘం జాతీయ గ్రంథపాలకుని దినోత్సవంగా నిర్వహించింది. ఈ సందర్భంగా దేశంలో గ్రంథాలయ శాస్త్రం అభివృద్ధికి కృషి చేసిన గ్రంథపాలకులను గుర్తించి, ఉత్తమ అవార్డులను చెన్నైలోని అన్నా సెంటరీనరీ లైబ్రరీలో ఆదివారం ప్రదానం చేసిందన్నారు. ఈ సందర్భంగా మీరా అవార్డును అందుకున్నారన్నారు.

తెలుగుతేజం అవార్డుకు ధర్మేష్ ఎంపిక



సీతానగరం: బొబ్బిల్లంకకు చెందిన యువ కవి, విద్యా సామాజిక సంస్కర్త నక్కిన ధర్మేష్.. తెలుగు తేజం తెలుగు భాషా సేవా పురస్కారానికి ఎంపికయ్యారు. అంతర్జాతీయ సాంస్కృతిక సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఏటా తెలుగు సాహిత్యంలో విశేష కృషి చేస్తున్న ప్రతిభావంతులకు ఈ అవార్డు అందజేస్తుంది. దీనిలో భాగంగా ఈ నెల 31న పల్నాడు జిల్లా నరసారావుపేటలో ధర్మేష్‌కు అవార్డు ప్రదానం చేయనున్నట్టు అంతర్జాతీయ సాంస్కృతిక సంస్థ శ్రీశ్రీ కళావేదిక చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ తెలిపారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

రాజానగరం: ప్రజా పంపిణీ వ్యవస్థలో అక్రమాలకు తావులేకుండా రేషన్ కార్డుల స్థానంలో క్యూఆర్ కోడ్ ఉండే స్మార్ట్ కార్డులను అందజేస్తున్నామని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. మండలంలోని శ్రీకృష్ణపట్నంలో సోమవారం స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. నియోజకవర్గంలో 87,185 కార్డులకుగాను ప్రస్తుతం 85,101 కార్డులను మొదటి విడతగా లబ్ధిదారులకు అందజేస్తున్నామన్నారు.

45 మద్యం సీసాల పట్టివేత

కంబాలచెరువు: అక్రమంగా నిల్వ ఉంచిన 45 మద్యం బాటిళ్లను టూటౌన్ పోలీసులు సోమవారం పట్టుకున్నారు. పోలీసులకు రాబడిన ముందస్తు సమాచారం ప్రకారం ఆల్కాట్ తోటలలోని అశోక్ స్ట్రీట్‌లో మింది గణేష్‌పై దాడి చేశారు. అతడి వద్ద సుమారు రూ.8 వేలు విలువైన బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

మాజీ హోం మంత్రి వనితకు పరామర్శ



బాబూరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: మాజీ హోంమంత్రి తానేటి వనిత మావయ్య తానేటి బాబూరావు ఇటీవల అనారోగ్యంతో కన్నుమూశారు. ఈ సందర్భంగా సోమవారం తాడేపల్లిగూడెంలో వనిత, ఆమె కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, అనపర్తి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి పరామర్శించారు. దివంగత బాబూరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఏడీబీ రోడ్డుపై ప్రయాణికుల అవస్థలు



రోడ్డు మార్జిన్‌లో దిగబడిన లారీ



రామస్వామిపేట వద్ద ఏర్పడిన ట్రాఫిక్ జామ్

రాజానగరం: రాజానగరం నుంచి కాకినాడ పోర్టు వరకూ గల ఏడీబీ రోడ్డును నాలుగు లేన్లుగా అభివృద్ధి పరిచే పనులు వేగంగా జరుగుతున్నాయి. అయితే ఈ పనులు జరుగుతున్న ప్రాంతాలలో వాహనాల రాకపోకలకు ప్రత్యామ్నాయ మార్గాలు చూపకపోవడంతో ప్రయాణికులు.. ముఖ్యంగా రాత్రి వేళల్లో అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ఇక్కడకు సమీపంలోని రామస్వామిపేట వద్ద రాత్రి, పగలు పనులు జరుగుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు ఆ ప్రాంతమంతా బురదగా మారడంతో కొన్ని చోట్ల లారీలు తదితర భారీ వాహనాలు రోడ్డు మార్జిన్లలో దిగబడిపోతున్నాయి. దీనితో అభివృద్ధి పనులతో ఇరుకుగా ఉన్న మార్గంలో వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. ఫలితంగా గంటల తరబడి ట్రాఫిక్ జామ్ ఏర్పడి, తమ సహనాన్ని పరీక్షిస్తోందని ప్రయాణికులు వాపోతున్నారు. ఇటువంటి సమయంలో అక్కడ ఉండే సూపర్ వైజర్ల నిర్లక్ష్యపు సమాధానాలు మరింత చికాకు కలిగిస్తున్నాయంటున్నారు. 108 వంటి అత్యవసర సర్వీసులకు కూడా ఈ ప్రాంతంలో ఇబ్బంది తప్పడం లేదంటే ట్రాఫిక్ అంతరాయం ఏ విధంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.

స్మార్ట్ కార్డుల పంపిణీలో బీసీ, ఎస్సీలపై వివక్ష

కడియం: ప్రభుత్వం కొత్తగా సిద్ధం చేసిన రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీలో ఎస్సీ, బీసీలపై అధికారులు వివక్ష చూపుతున్నారని జేగురుపాడు సర్పంచ్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్రస్టాలిన్ అన్నారు. ఆయన సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఈ కార్డుల పంపిణీని గ్రామ సచివాలయం వద్ద కాకుండా ప్రైవేటు స్థలంలో ఇస్తున్నారని, అంతే కాకుండా సర్పంచ్‌నైన తనకు ఆహ్వానం లేదన్నారు. అలాగే గ్రామంలోని ఎస్సీ, బీసీలకు ఎటువంటి సమాచారం లేదని తెలిపారు. ప్రైవేటు వ్యక్తుల స్థలంలో చేస్తున్న కార్డుల పంపిణీ విషయాన్ని గ్రామస్తులు తన దృష్టికి తీసుకురాగా, తాను స్వయంగా అక్కడకు వెళ్లానన్నారు. కార్యక్రమాన్ని నడిపించాల్సిన వీఆర్వో శివకృష్ణ అక్కడ లేరన్నారు. దీంతో ఆయనకు ఫోన్ చేసి నిబంధనల ప్రకారం సచివాలయంలో ఇవ్వాలని, ప్రొటోకాల్ ప్రకారం తనకు సమాచారం ఇవ్వాలని, కానీ ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించినప్పటికీ సమాధానం లేదన్నారు. ఎస్సీ, బీసీలను అవమానపరిచే విధంగా వ్యవహరిస్తున్న ఇటువంటి అధికారుల తీరును స్టాలిన్ తప్పుపట్టారు. అలాగే ఆర్డీవో కార్యాలయంలో ఈ మేరకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు స్టాలిన్ చెప్పారు. ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించే అధికారులు అన్ని కులాలకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలని, అంతేగానీ కులాల మధ్య ఘర్షణలకు దారితీసే విధంగా వీఆర్వో వ్యవహరించడం దారుణమని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

కూలీలుగా మారిన విద్యార్థులు



పాలమూరు జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో గడ్డి చెక్కుతున్న విద్యార్థులు

అనపర్తి: విద్యాబుద్ధులు నేర్పుతారని పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపిస్తే.. చదువు చెప్పడం మానేసి, వారితో పనులు చేయించడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాలమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఈ ఘటన జరిగింది. వివరాల్లోకి వెళితే.. ఇటీవల కురిసిన వర్షాలకు పాఠశాల ఆవరణలో గడ్డి బాగా పెరిగిపోయింది. దీంతో ఏడు, ఎనిమిది తరగతులు చదువుతున్న విద్యార్థులకు పలుగు, పార ఇచ్చి, మైదానాన్ని శుభ్రం చేయించారు. దీనిపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆ గడ్డిలో పాములు, పురుగు పుట్ర ఉంటే పరిస్థితి ఏమిటన్నారు. ఆ పని ముట్లను వాడే క్రమంలో పిల్లలకు ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారన్నారు. దీనిపై ఉన్నతాధికారులు విచారణ జరిపి.. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎరువుల సరఫరాలో పారదర్శకత పాటించాలి



కోరుకొండలో పద్మజ ఫెర్టిలైజర్స్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

కోరుకొండ/సీతానగరం: పీఏసీఎస్‌ల్లో రైతులకు ఎరువుల పంపిణీలో భూమి విస్తీర్ణాన్ని ప్రామాణికంగా తీసుకోవడం తగదని, ఎరువుల అక్రమ రవాణాకు పాల్పడినా, నిల్వలున్నా కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పి.ప్రశాంతి హెచ్చరించారు. కోరుకొండ మండలం గాడాల, సీతానగరం మండలం వెదుళ్లపల్లిలోని పీఏసీఎస్‌లను ఆమె సోమవారం తనిఖీ చేశారు. అలాగే కోరుకొండలోని గ్రోమోర్ గోడౌన్, పద్మజ ఫెర్టిలైజర్ షాపులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి రికార్డులను, ఎరువుల నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గాడాలలో ఎరువుల పంపిణీ సక్రమంగా జరగలేదన్నారు. రికార్డుల్లో ఒక్కో రైతుకు 5 కంటే ఎక్కువ ఎరువుల బస్తాలివ్వడం సరి కాదన్నారు. రెండు బస్తాల కంటే ఎక్కువ ఇచ్చిన వారి నుంచి రికవరీ చేయాలని సీఈఓ ఏడుకొండలును ఆదేశించారు. గాడాల పీఏసీఎస్ పరిధిలో గాడాల, మధురపూడి, నిడిగట్ల గ్రామాలుండగా, ఇక్కడి రైతులతో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు రైతులకు కూడా ఎరువులు ఇచ్చినట్టు గుర్తించారు. జిల్లా సహకార అధికారి ఎం. వెంకట రమణ, వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ మాధవరావు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనారోగ్య సమస్యలు



సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మి

కోరుకొండ: బాల్య వివాహాల కారణంగా చిన్న వయసులోనే గర్భం దాల్చడంతో ఆడపిల్లలకు అనేక అనారోగ్య సమస్యలు వస్తాయని జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎన్.లక్ష్మి అన్నారు. కాపవరం ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన లక్ష్మి మాట్లాడుతూ అమ్మాయికి 18, అబ్బాయికి 21 ఏళ్లు నిండకుండా వివాహం చేయకూడదన్నారు. అలాగే యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. వీరికి కౌన్సెలింగ్ విషయమై న్యాయసేవాధికారసంస్థ సేవలను వినియోగించుకోవాలని కోరారు. సమావేశంలో డాక్టర్ కోమల, సీడీపీఓ సంధ్యారాణి, డీసీపీఓ అనంత ప్రదీప్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



జి.మామిడాడలో యూరియా నిల్వలను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

పెదపూడి: ఎరువులు, పురుగుమందు షాపుల్లో యూరియాను కొరత లేకుండా నిబంధనల ప్రకారం రైతులకు విక్రయించాలని రాజమహేంద్రవరం విజిలెన్స్ సీఐ ఐ.గోపాలకృష్ణ అన్నారు. జి.మామిడాడ గ్రామంలోని అనంతలక్ష్మి, సూర్య ఏజెన్సీస్ దుకాణాలను సోమవారం విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. ముందుగా పలు రికార్డులు, రిజిస్టర్లు పరిశీలించారు.ఈ పోస్ మెషీన్లలో రైతులకు విక్రయించే ఎరువులు వివరాలు, ఆధార్ నంబర్ తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. సరకుల వివరాలు, ధరలు తెలిపే బోర్డులను షాపుల వద్ద ఏర్పాటు చేయాలన్నారు. విజిలెన్స్ తహసీల్దార్ కె.విజయ కుమార్, సిబ్బంది లోవరాజు, ఏఓ ఎస్.సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి ప్రతిమలతో పర్యావరణ రక్షణ



పందలపాకలో మట్టి విగ్రహాలతో విద్యార్థులు

పెదపూడి: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మట్టితో తయారు చేసిన గణపతి విగ్రహాలు పూజించాలని జి.మామిడాడ గ్రామానికి చెందిన సూక్ష్మ కళాకారుడు, వ్యాయామ ఉపాధ్యాయుడు, స్థానిక శ్రీసూర్య లయన్స్ క్లబ్ కార్యదర్శి ద్వారంపూడి యువరాజారెడ్డి అన్నారు. గ్రామంలో సోమవారం భక్తులు, ప్రజలకు మట్టి ప్రతిమలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రకృతి, పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించాలని ఉద్దేశంతో ప్రతి ఏడాది వినాయక చవితికి మట్టి గణపతి ప్రతిమలను సొంతంగా తయారు చేసి పంపిణీ చేస్తున్నానన్నారు.



జి.మామిడాడలో మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న యువరాజారెడ్డి

చిట్టి చేతులు.. మట్టి గణపతులు

బిక్కవోలు: పందలపాకలోని పడాల పెద పుల్లారెడ్డి జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం చిట్టి చేతులు.. మట్టి గణపతులు కార్యక్రమం నిర్వహించారు. పీడీ ద్వారంపూడి యువరాజారెడ్డి ఆధ్వర్యంలో చిన్నారులు ఆదివారం తమ ఇంటి వద్ద తయారు చేసిన మట్టి విగ్రహాలను పాఠశాలకు తీసుకువచ్చారు. హెచ్ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు వివిధ ఆకృతులలో మట్టి గణపయ్యలను సుందరంగా తయారు చేశారన్నారు.

ప్రశాంతంగా వినాయక చవితి ఉత్సవాలు

అనపర్తి: వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా, భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని సీఐ వీఎల్‌వీకే సుమంత్ అన్నారు. ఆయన సోమవారం మాట్లాడుతూ ప్రజలకు అసౌకర్యం కలిగేలా శబ్ద కాలుష్యాలు, ప్రమాదకరమైన బాణసంచాను కాల్చకూడదన్నారు. విగ్రహం నిలబెట్టే వారు తప్పనిసరిగా పోలీసుల అనుమతి పొందాలన్నారు. సింగిల్ విండో విధానంలో దరఖాస్తు చేసుకుని క్యూఆర్ కోడ్‌ను పొందాలన్నారు. ఉత్సవ మండపాల వద్ద విగ్రహాలకు భద్రతగా కమిటీ సభ్యులు ఉండాలని చెప్పారు. మండపాల వద్ద తాత్కాలిక సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేయాలని, విగ్రహం ఎత్తు ఐదు అడుగులకు మించరాదన్నారు.

అనుమతి తప్పనిసరి

బిక్కవోలు: వినాయక మండపాలకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని ఎంపీడీవో నాగేంద్ర ప్రసాద్ అన్నారు. ఆయన మాట్లాడుతూ ముందుగా ఎంత విగ్రహం పెడుతున్నారో రెవెన్యూ శాఖ అనుమతి, మైక్, డీజేలకు సంబంధించి పోలీసులు అనుమతి, విగ్రహం ఏర్పాటు చేసే ప్రదేశానికి సదురు సైట్ ఓనర్ నుంచి ఎన్‌ఓసీ తీసుకురావాలన్నారు.

నిబంధనలు పాటించాలి

పెదపూడి: వినాయక చవితి ఉత్సవాల నిర్వహణలో ఆలయ ఉత్సవ కమిటీలు, భక్తులు, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని పెదపూడి ఎస్సై ఎస్.తులసిరామ్ తెలిపారు. మండపం, మైక్ సెట్ ఏర్పాటుకు అనుమతి కోసం ఆన్‌లైన్ పోర్టల్లో దరఖాస్తు చేస్తే 24 గంటల్లో అనుమతి వస్తుందన్నారు.

అశ్లీల కార్యక్రమాలొద్దు

కోరుకొండ: గణపతి నవరాత్రి ఉత్సవాల్లో అశ్లీల కార్యకలాపాలు లేకుండా ప్రశాంతంగా నిర్వహించడానికి కమిటీలు కృషి చేయాలని కోరుకొండ సీఐ సత్యకిశోర్ అన్నారు. కోరుకొండ పోలీస్ స్టేషన్ వద్ద మండలంలోని ఉత్సవ కమిటీల సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అనుమతులు లేకుండా ఉత్సవాలు నిర్వహించకూడదన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కంబాలచెరువు: కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశాకు చెందిన దిల్‌కస్ షబర్ (30) కూలి పని చేసుకునేందుకు రాజమహేంద్రవరం వచ్చాడు. అయితే కొద్ది రోజుల క్రితం గోదావరి గట్టుపై ఉన్న కరెంట్ ఆఫీసు వద్ద ఆటో ఢీకొని గాయపడ్డాడు. అతడిని ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా బ్రెయిన్‌లో తేడా వచ్చి పరిస్థితి విషమించింది. దీంతో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వ్యక్తిపై కేసు నమోదు

సీతానగరం: చినకొండేపూడికి చెందిన నంద్యాల త్రిమూర్తుల రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సలాది సత్యనారాయణపై కేసు నమోదు చేశామని ఎస్సై డి.రామ్ కుమార్ సోమవారం తెలిపారు. వివరాలు.. చినకొండేపూడికి చెందిన త్రిమూర్తులు రాజు 12 ఏళ్లుగా పాల వ్యాపారం చేస్తున్నాడు. అతడి దుకాణంలో సీతానగరానికి చెందిన సత్యనారాయణ సహాయం చేసేవాడు. త్రిమూర్తులురాజు వ్యాపారం కోసం బయటకు వెళ్లే సమయంలో పాల అమ్మకాలు జరిపేవాడు. అయితే మూడేళ్లుగా వ్యాపారంలో నష్టం రావడంతో త్రిమూర్తులురాజు తన దుకాణంలో ఎవ్వరికీ తెలియకుండా సీసీ కెమెరా ఏర్పాటు చేశాడు. ఈ సందర్భంగా దుకాణంలోని గల్లాయి పెట్టెలో డబ్బులను సత్యనారాయణ దొంగిలిస్తున్నట్లు రికార్డు అయ్యింది.

అర్జీల పరిష్కారానికి చర్యలు

రాజమహేంద్రవరం సిటీ: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీలకు నాణ్యతతో పరిష్కారం చూపాలని అడిషనల్ కమిషనర్ పీపీ రామలింగేశ్వర్ ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 23 వినతులు స్వీకరించారు.

పుష్కర ఘాట్‌లో 'శుభంకర మహా గణపతి'



సమావేశంలో మాట్లాడుతున్న రాజమహేంద్ర గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షురాలు జక్కంపూడి విజయలక్ష్మి

సీటీఆర్ఐ: పుష్కరఘాట్‌లో ఈ ఏడాది శుభంకర మహాగణపతిని ఏర్పాటు చేయనున్నట్టు రాజమహేంద్రి గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకురాలు జక్కంపూడి విజయలక్ష్మి వెల్లడించారు. స్థానిక పుష్కర ఘాట్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆమెతో పాటు కమిటీ ప్రతినిధులు చల్లా శంకరరావు, పోలసానపల్లి హనుమంతరావు, బైర్రాజు ప్రసాదరాజు, నందెపు శ్రీనివాస్ ఉన్నారు. విజయలక్ష్మి మాట్లాడుతూ 2010లో జక్కంపూడి రామ్మోహనరావు వ్యవస్థాపకుడిగా రాజమహేంద్రి గణేష్ ఉత్సవ సమితిని ఏర్పాటు చేసి గణపతి నవరాత్రులు మొదలు పెట్టామన్నారు. ఈ ఏడాది 16వ వార్షిక ఉత్సవాల్లో భాగంగా 18 అడుగులు ఎత్తయిన శుభంకర మహా గణపతి విగ్రహాన్ని నూలు పోగులు, పసుపు తాడుతో రూపొందిస్తున్నామన్నారు. స్త్రీ రూపంలో గణపతిని ప్రతిష్ఠ చేస్తున్నామన్నారు. ఈ నెల 27వ తేదీ ఉదయం గణపతి హోమంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని, 7వ తేదీన ఉదయం నిమజ్జనం, అనంతరం నూలు పోగుల వితరణ ఉంటుందని తెలిపారు. నందెపు శ్రీనివాస్ మాట్లాడుతూ ఏటా మాదిరిగానే ఎస్వీ మార్కెట్‌లోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామిని ఇక్కడకు తీసుకొచ్చి సెప్టెంబర్ 2న కల్యాణం జరిపిస్తామన్నారు. సమావేశంలో కొమ్ముల సాయి, వాకచర్ల కృష్ణ, పిచ్చుక సత్యనారాయణ, నిడిగట్ల బాబ్జీ, కరుణామయుడు శ్రీను తదితరులు పాల్గొన్నారు.